జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## మహబూబ్‌నగర్



నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

మంగళవారం, జనవరి 13, 2026 | పేజీలు: 9


### బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి చూస్తే

# కడుపు నిండిన భావన

- కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో కొత్తదేమీ లేదు
- ఉన్న పథకాలే ఊడగొట్టారు : కేటీఆర్



**మహబూబ్‌నగర్, జనవరి 12 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూస్తే తనకు కడుపు నిండిన భావన కలిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులను కేటీఆర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన అభివృద్ధిని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ప్రజలకు చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని విమర్శించారు.

- మిగతా 2లో..



### బాధితులకు సత్వర

# న్యాయం అందించాలి

ప్రతినెల విధిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలి
-ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి
-బాధితులకు సత్వర న్యాయం అందించాలి -పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి




నాగర్ కర్నూల్:జనవరి 12ప్రజా జ్యోతి
నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ భవనంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ,PCR 1955 & POA Act,1989 అమలుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ చైర్మన్,పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎమ్మెల్యే డాక్టర్.చిక్కుడు వంశీకృష్ణ,

- మిగతా 2లో..

# సీఎం కప్‌కు పటిష్ట ఏర్పాట్లు

- గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పోటీలు
- కలెక్టర్ విజయేందిర బోయి

2 లో



### రూ.1200 కోట్ల అభివృద్ధి పనులకు

# సీఎం శంకుస్థాపనలు

- జనవరి 17న మహబూబ్‌నగర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు
-మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్, జనవరి 12 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ నెల 17న మహబూబ్‌నగర్ జిల్లాకు విచ్చేసి సుమారు రూ.1200 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఐఐఐటి కళాశాల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, శాశ్వత తాగునీటి సరఫరా, ఎంవిఎస్ కళాశాల భవన నిర్మాణం వంటి కీలక

- మిగతా 2లో..



# రూ.1200 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు

ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారని మంత్రి పేర్కొన్నారు. ఇవి మహబూబ్‌నగర్ జిల్లా విద్యా మరియు మౌలిక వసతుల అభివృద్ధికి మైలురాయిగా నిలవనున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభా ఏర్పాట్లు, భద్రతా చర్యలు, మౌలిక సదుపాయాల కల్పనపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా స్థాయి అధికారులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని, సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణం, వేదిక ఏర్పాట్లు, రహదారుల అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుధ్య చర్యలు, భద్రత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనతో జిల్లా అభివృద్ధికి మరింత ఊతం లభించనుందని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని అధికారులను కోరారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించగా, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం ఐఐఐటి కళాశాల నిర్మాణం చేపట్టనున్న చిట్టబోయినపల్లి ప్రాంతం, ముఖ్యమంత్రి సభ నిర్వహించనున్న ఎంవిఎస్ కళాశాల ప్రాంగణాన్ని ఎమ్మెల్యేలు, అధికారులు కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్‌కు పటిష్ట ఏర్పాట్లు

**మహబూబ్‌నగర్, జనవరి 12 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం నిర్వహించిన జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో సీఎం కప్ నిర్వహణతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో పోటీలు నిర్వహించేందుకు ఎంపీడీవోలు, ఎంఈవోలు, పీఈటీల సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

ఈ నెల 17 నుంచి ఫిబ్రవరి 23 వరకు గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకూ సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పాల్గొనే ప్రతి జట్టు తప్పనిసరిగా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. పీఈటీలు, క్రీడా సంఘాలు విద్యార్థులు, యువత నమోదు ప్రక్రియకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోటీలు జరిగే ప్రతి క్రీడా స్థలంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి అవసరమైన చోట గ్రామ పంచాయతీ తీర్మానాలతో ఎంపీడీవోల ద్వారా ప్రతిపాదనలు పంపాలని ఏపీఎంలను ఆదేశించారు. ఈజీఎస్ ద్వారా ఒక్కో భవనానికి రూ.10 లక్షలు మంజూరు చేయనున్నట్లు, మార్చి 31లోగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. మండల సమాఖ్య భవనాలు లేని చోట కూడా రూ.10 లక్షలతో నిర్మాణానికి ప్రతిపాదనలు వెంటనే పంపాలని సూచించారు. ప్రతి మండలంలో 100 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.30 లక్షలు మంజూరు చేయనున్నట్లు పేర్కొని, ఎంపీడీవోల ద్వారా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

జిల్లాలోని 139 పాఠశాలల్లో ఒక్కో టాయిలెట్‌కు రూ.2 లక్షల చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరు లోగా పనులు పూర్తి చేయాలని ఎంఈవోలు, ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే 233 అంగన్వాడి కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణానికి ఒక్కొక్కటికి రూ.52 వేల చొప్పున వారం లోగా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి లోగా పనులు పూర్తి చేయాలని సీడీపీవోలు, సూపర్వైజర్లు, ఎంపీడీవోలతో సమన్వయం చేయాలని సూచించారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా నేడు, రేపు అన్ని గ్రామాల్లో పారిశుధ్య డ్రైవ్ చేపట్టి డ్రైన్ల పూడికతీత, శుభ్రత, చెత్త కుప్పలు మరియు పిచ్చి మొక్కల తొలగింపును చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్పీ సీఈఓ వెంకట రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి చూస్తే కడుపు నిండిన భావన

**కేటీఆర్‌కు ఘన స్వాగతం..పట్టణం లో పెద్దఎత్తున బైక్ ర్యాలీ**

మహబూబ్‌నగర్‌కు చేరుకున్న కేటీఆర్‌కు మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మా రెడ్డిలు, మాజీ ఎమ్మెల్యేలు హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీతో పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తూ ఎంబీసీ మైదానానికి చేరుకున్నారు.

**" సర్పంచ్ ఎన్నికలలో 40 శాతం సీట్లు బీఆర్‌ఎస్‌కే -- ప్రజల్లో మార్పు మొదలైంది"**

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ కొత్తగా చేసిందేమీ లేదని, పైగా బీఆర్‌ఎస్ హయాంలో అమలైన పథకాలను కూడా నిలిపివేశారని మండిపడ్డారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 40 శాతం సీట్లు బీఆర్‌ఎస్‌కు రావడం ప్రజల్లో మార్పు మొదలైందనడానికి నిదర్శనమన్నారు.

**"ఆరు గ్యారంటీలు.. ఒక్కటి కూడా అమలు కాలేదు"**

పాలమూరు బిడ్డనని చెప్పి, ఆరు గ్యారంటీలు అంటూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలుకాలేదని ప్రశ్నించారు. కొత్త పథకాలు అమలు చేయడం దేవుడెరుగు.. ఉన్న పథకాలే ఊడగొట్టారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**"పాలమూరు ప్రాజెక్ట్ 90% పూర్తయ్యింది.. మిగిలిన 10% చేయలేకపోయారు"**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కేసీఆర్ హయాంలోనే 90 శాతం పూర్తయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే భయంతో పాలమురును కావాలనే ఎండబెడుతున్నారని ఆరోపించారు.

**"మహబూబ్‌నగర్ రూపురేఖలే మారాయి"**

బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు, రహదారులు, ఫ్లైఓవర్లు, స్ట్రీట్ వెండింగ్ జోన్‌లు అభివృద్ధికి నిదర్శనమని కేటీఆర్ తెలిపారు. మహబూబ్‌నగర్ మాత్రమే కాకుండా నారాయణపేట, జడ్చర్ల పట్టణాల అభివృద్ధి కూడా అందరికీ కనిపిస్తోందన్నారు.

**"ట్యాంకర్లలో నీళ్లు లేవు.. వీధుల్లో లైట్లు వెలగట్లేమ**

పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కింద గ్రామాలు పట్టణాలు అన్న తేడా లేకుండా అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పాలనలో ట్యాంకర్లలో నీళు లేవు, ట్రాక్టర్లలో డీజిల్ లేదు, వీధి దీపాలు వెలగడం లేదని విమర్శించారు.

**"రైతులకు, కూలీలకు న్యాయం ఎక్కడ?"**

రైతు బంధు, కౌలు రైతులు, రైతు కూలీలకు ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని దెబ్బతీస్తోందని, స్కూటీలు రాకపోయినా లూటీలు మాత్రం జోరుగా సాగుతున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**నూతన ప్రజాప్రతినిధులకు సన్మానం**

అనంతరం నూతనంగా ఎన్నికైన బీఆర్‌ఎస్ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులను కేటీఆర్ సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి బీఆర్‌ఎస్ ఆశయాలను గ్రామస్థాయిలో బలంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

## బాధితులకు సత్వర న్యాయం అందించాలి

విజిలెన్స్‌మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతికి వారి అవగాహనకు ప్రతి నెల 30,31న, సివిల్ రైట్స్ నిర్వహించి ఎస్సీ ఎస్టీలకు చట్టాలపై అవగాహన కల్పించాలనిఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎంక్వైరీ వేగంగా పూర్తి చేసి ఛార్జ్ షీట్ వేస్తే,బాధితులకు న్యాయంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం వెంటనే అందజేసి,పేద ప్రజలకు సరైన అవగాహన కల్పించి ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలని అధికారులకు సూచించారు.అన్నిసంక్షేమ పథకాలలో ఎస్సీ,ఎస్టీ లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్సీ,ఎస్టీ యువత ఉపాధి పథకాలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలని,అందుకు ప్రత్యేక అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు.ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీలపై దాడులు జరిగిన వెంటనే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి,వారికి రూ.25వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని,ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు బాధితులకు ప్రభుత్వ ఉత్తర్వులు,చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు అయిన వెంటనే రూ.25వేల పరిహారం చెల్లించి, చార్జ్‌షీటు దాఖలు అయ్యాక 50 శాతం, కేసు పూర్తి అయ్యాక మొత్తం చెల్లించేలా చూడాలని,ఎస్సీ,ఎస్టీల కేసుల పరిష్కారానికి యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.అనంతరం జిల్లాకలెక్టర్ బాదావత్ సంతోష్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికి 251 ఎస్సీ,ఎస్టీ ఫిర్యాదులు అందగా అందులో 233 కేసులు అట్రాసిటీ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందని,వాటిలో 176 కేసులకు చార్జ్‌షీటు వేయడం అయ్యిందని, ఇప్పటివరకు 233 కేసులకు పరిహారం మంజూరు చేయడం,అందులో 18 పెండింగ్లో ఉన్నాయనిమిగతా కేసులకు త్వరగా చార్జ్‌షీటు వేసే విధంగా చూడాలన్నారు.పోలీసు,రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి బాధితులకు న్యాయం జరిగే లా చూడాలన్నారు.ఎస్సీ,ఎస్టీ కేసులకు సంబంధించిన నష్టపరిహారం న్యాయపరమైన సమస్యలను వేగవంతంగా పరిష్కరించేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని,మిగతా కేసులకు త్వరగా చార్జ్‌షీటు వేసే విధంగా చూడాలని, అదేవిధంగా రెవెన్యూ,పోలీస్ శాఖ సిబ్బంది గ్రామాల్లో సివిల్ రైట్స్ దినం నిర్వహించి ఎస్సీ, ఎస్టీ ల హక్కులపై అవగాహన కల్పించాలని,అందుకు సంబంధించి నివేదికను జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖకు అందచేయాలని సూచించారు.ఎస్సీ,ఎస్టీ సభ్యులు మాట్లాడుతూ పారదర్శకత,బాధ్యతాయుత సమర్పణ,ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అన్ని శాఖలు మరింతగా సమన్వయం చేసుకోవాలని కమిటీ సూచించింది.అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ భూ సమస్యల వల్లనే తగాదాలు జరుగుతున్నాయని,వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్,డి.ఎస్.పిలు బుర్రి శ్రీనివాసులు, శ్రీనివాస్,ఎస్సీ,ఎస్టీ కులాల నుండి ప్రాతినిథ్యం సభ్యులు,ఎల్లపోగు వెంకటస్వామి,చిననగల్లా పరశురాం,గుమ్మకొండ రాములు,రెణయ్య,చందర్, రెద్యా,ఆర్డీవోలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి,మెంబర్ సెక్రెటరీ ఉమాపతి,అధికారిక కమిటీ సభ్యులు పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు , జిల్లా లేబర్ అధికారి రాజ్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థిక ప్రగతికి బ్యాంకర్ల భాగస్వామ్యం అవసరం**

నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఆర్థిక ప్రగతితో పాటు ప్రజల సంక్షేమాన్ని సాధించాలంటే బ్యాంకర్ల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు.పేద ప్రజలు ఆర్థికంగా ఎదగాలంటే చిన్నపరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలని ఉపాధి అవకాశాల పెంపుతో పాటు స్వయం ఉపాధిదిశగా ముందుకు నడిపించడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని అన్నారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ భవనంలో జిల్లా బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అధ్యక్షత వహించగా కలెక్టర్ బాదావత్ సంతోష్,ఎస్పీ డాక్టర్సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విశ్వకర్మ యోజన,పీఎంఈజీపీ,ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ,గ్రామీణ బ్యాంకింగ్ సేవల అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గం ఆర్థిక ప్రగతి,ప్రజల సంక్షేమానికి బ్యాంకర్ల భాగస్వామ్యం అత్యంతకీలకమని పేద ప్రజలు ఆర్థికంగా ఎదగాలంటే చిన్న పరిశ్రమల స్థాపనకు బ్యాంకులు సహకరించాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా బ్యాంకర్లు చురుకైనపాత్ర పోషించాలని ముఖ్యంగా స్వయం ఉపాధి,గ్రామీణ ఆర్థికాభివృద్ధికి రుణాల మంజూరులో వేగంపెంచాలని,గత సంవత్సరం5,241 మంది లబ్ధిదారులకు 502 కోట్ల రుణాలు ఇవ్వడంపై బ్యాంకర్లను ఎంపీ అభినందించారు.పిఎం ఈజిపి ద్వారా జిల్లాలో 63 యూనిట్లలకు 184.06 కోట్ల రూపాయలు రుణాలు విడుదల చేశారని,ఇదేవిధంగా రానున్న సంవత్సరాలలో కూడా ప్రజలకు మరింత ఎక్కువ మొత్తంలో రుణాలు అందజేసిన బ్యాంకర్లు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి చొరవతో ప్రజలకు అవగాహన కల్పించి బ్యాంకర్లతో అనేక పర్యాయాలు సమావేశాలు నిర్వహించి అత్యధికంగా రుణాలు ఇచ్చి కృషి చేశారని,ప్రభుత్వ పథకాల అమలుకు బ్యాంకులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవల్లో భద్రత,ప్రజలకు అవగాహన కల్పనపై దృష్టి పెట్టాలన్నారు.ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక రకాల పథకాలను అమలు చేస్తుందని,రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బ్యాంకర్లు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.అమరేందర్,లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్,బ్యాంకుల ప్రతినిధులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

# జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి

## అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ








**గద్వాల జనవరి 12(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
ఔత్సాహిక క్రీడాకారులకు సీఎం కప్ గొప్ప అవకాశమని,జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీనారాయణ అన్నారు.జిల్లా యువజన,క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం గద్వాల ఇండోర్ మైదానంలో సీఎం కప్ క్రీడా పోటీల టార్చ్ ర్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అదనపు ఎస్పి శంకర్,అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)నర్సింగరావు తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందుగా ఆయన చిత్రపటానికి ముఖ్య అతిథులు పూలమాల వేసి పూజలు చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ,సీఎం కప్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా టార్చ్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.చీకట్లో ఏదైనా వస్తువును వెతికేందుకు టార్చ్ లైట్లు ఎలా వినియోగిస్తామో అలాగే ప్రతిభగల క్రీడాకారులను వెలికి తీసేందుకు ఈ టార్చ్ ర్యాలీ దోహదపడుతుందన్నారు.యువతకు తన సందేశాలతో జాగృతం చేసిన స్వామి వివేకానంద జయంతి రోజునే ఈ సీఎం కప్ కార్యక్రమం ప్రారంభించుకోవడం శుభసూచకమని పేర్కొన్నారు.స్వామీజీ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని ప్రశంసించారు.ఆయన స్ఫూర్తితో యువత క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సమాజంలో వ్యసనాలను రూపుమాపి,నవ సమాజ నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ,క్రీడలకు వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని ఆటలు ఆడేందుకు కేటాయిస్తే ఆనందంగా ఉండవచ్చున్నారు.ప్రస్తుతం తల్లిదండ్రుల వైఖరిలోనూ మార్పు వచ్చిందని పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ చాలామంది ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీసేందుకు సీఎం కప్ దోహదపడుతుందని పేర్కొన్నారు.క్రీడాకారులు జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్ర,జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి జోగులాంబ గద్వాల ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.ఉక్కు కండరాలు,దృఢమైన శరీరం కలిగిన యువత దేశాభివృద్ధికి అవసరమని పేర్కొన్న స్వామి వివేకానంద సూక్తులను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు.
అదనపు ఎస్పీ శంకర్ మాట్లాడుతూ,ప్రతి ఒక్కరూ శారీరకంగా దృఢంగా ఉండడమే కాక మానసికంగానూ,ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు ఉపయోగపడతాయన్నారు.గ్రామ స్థాయిలో నుంచి మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు సీఎం కప్ పోటీలు దోహదపడతాయన్నారు.దేశంలో 140 కోట్లకు పైగా జనాభా ఉండగా అంతర్జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో రాణించే క్రీడాకారుల సంఖ్య తక్కువగా ఉందని,యువత సీఎం కప్ ద్వారా అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు.ఫలితంగా పుట్టిన ఊరుకు, దేశానికి మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు.క్రీడాకారులు ఎల్లప్పుడూ ఉల్లాసంగా ఉండాలని దాంతో ఏ పని చేసినా,విజయవంతం అవుతుందన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు క్రీడాకారులకు సీఎం కప్ టీ షర్టులను అందజేశారు.అనంతరం టార్చ్ ను వెలిగించి ర్యాలీ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డిఈఓ విజయలక్ష్మి,గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్,డివైఎస్ఓ కృష్ణయ్య,ఎస్ జిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు,వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు,కార్యదర్శి బీసన్న,పలువురు పిఈటిలు,పీడీలు,విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు,వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు,క్రీడాకారులు,తదితరులు పాల్గొన్నారు.

# యువత వివేకానందుడిని ఆదర్శనంగా తీసుకోవాలి

## -డిప్యూటీ లీగల్ సర్వీసెస్ అథరిటీ సెక్రటరీ శ్రీరామ్ ఆర్య





**నాగర్ కర్నూల్ : జనవరి 12 ప్రజా జ్యోతి**
రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ గారి ఆధ్వర్యంలోసోమవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ మరియు సెక్రటరీ ఆదేశాల మేరకు వట్టెం గ్రామపంచాయతీ కార్యాలయంలో వివేకానంద జయంతి సందర్భంగా నేషనల్ యూత్ డే ను నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీరామ్ ఆర్య డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 12న,మనం వివేకానంద జయంతి సందర్భంగా నేషనల్ యూత్ డే కార్యక్రమాన్ని నిర్వహించుకుంటామని అందులో భాగంగా వారం రోజులుగా వివేకానంద జయంతి వారోత్సవాలను డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథరిటీ తరఫున నిర్వహిస్తున్నామని,అందరూ వివేకానందుని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటామని,ఎందుకంటే వివేకానందుడు యువతకు స్ఫూర్తి,దేశభక్తి,ఆత్మవిశ్వాసం,సేవా భావాలను పెంపొందించాడనిపాశ్చాత్య దేశాలకు భారతీయ వేదాంతాన్ని పరిచయం,మత ఔన్నత్యాన్ని చాటాడు కాబట్టి ఆయన ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకోవడానికి ఈరోజును జరుపుకుంటామని అన్నారు.1893లో చికాగోలో జరిగిన ప్రపంచ మత సమావేశంలో ఆయన చేసిన ప్రసంగం హిందూమతం భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాడని,రామకృష్ణ మిషన్ స్థాపించి సామాజిక సేవ విద్యా బోధనలద్వారా దేశపురోగతికి కృషిచేశాడు కాబట్టి యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో గొప్పగా ఎదగాలన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జ్యోతి శంకర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే రైతులు ఆర్థికంగా ఎదుగుతారు

## సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి



**మల్దకల్ జనవరి 12(ప్రజా జ్యోతి డివిజన్):**
మల్దకల్ మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ పశువైద్య శిబిరం వద్ద నూతనంగా పశువుల స్టాండ్ సర్పంచ్ శిరీష అల్వాల రాజశేఖర్ సహకారంతో ఏర్పాటు చేసిన మండల పశు వైద్య అధికారులు డాక్టర్ ఉష,డాక్టర్ వినయ్ కుమార్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ కే.శిరీష అల్వాల రాజశేఖర్ రెడ్డి పాల్గొని పశువుల స్టాండ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఉష మాట్లాడుతూ, పశువులకు గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని,47 పశువులకు చికిత్స,15దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించటం జరిగిందని,40 గొర్రెలు మరియు మేకలకు 50 కోళ్లకు మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు.సకాలంలో పశువుల ఎదను గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయించాలని,ఏడాదికి ఒక పశువుకి ఒక దూడ వచ్చేలా చూసుకోవాలని, కృత్రిమ గర్భధారణ వల్ల గ్రామాలలో మేలు జాతి పశు సంపద పెరిగి తద్వారా తలసరి పాల ఉత్పత్తి పెరుగుతుందని డాక్టర్ ఉష పాడి రైతులకు చెప్పడం జరిగినది.గ్రామ సర్పంచ్ కే.శిరీష రాజశేఖర్ రెడ్డి పశు పోషకలతో మాట్లాడుతూ,పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమవుతుందని,పశువుల సంరక్షణలో పోషకలు తగ్గిన శ్రద్ధ చూపాలన్నారు.ఇలాంటి ప్రత్యేక పశు వైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మి నరసింహ, వార్డు మెంబెర్స్,వెంకటేష్,పరుశు రాముడు,సవారీ,గ్రామస్తులు,శివన్న,గోపాల్,ఉల్వ నర్సింహా,శ్రీశైలం,కిష్టన్న, నర్సింలు,ఎర్రన్న,నడిపన్న, ప్రభాకర్,ప్రశాంత్,నాగరాజు, రమేష్,ఓంశంకర్,పశువైద్య సిబ్బంది ఎం.రాముడు,మధు తదితరులు పాల్గొన్నారు.



# ఛలో షాద్ నగర్ గోడ పత్రిక విడుదల

## బహుజన నాయకులు

**మల్దకల్ జనవరి 12(ప్రజా జ్యోతి డివిజన్):**
బిఎస్పీ గద్వాల్ నియోజకవర్గం అధ్యక్షులు బండారి ఎస్ రాజు,బహుజన రాజ్యసమితి నాయకులు వినోద్ మాట్లాడుతూ,జనవరి 15న, బెహన్ కుమారి మాయావతి పుట్టినరోజు సందర్భంగా షాద్ నగర్ లో భారీ సభ దళిత, బహుజన,ప్రజాస్వామ్య వాదులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ రాష్ట్రంలో ఎక్కడ చూసినా దళిత బహుజనల పైన హత్యలు,అత్యాచారం జరుగుతున్నా ఈ కాంగ్రెస్ పట్టించుకోవడంలేదని విమర్శ చేశారు,అగ్రకుల ఆధిపత్య పార్టీ లైన్ బిజెపి,కాంగ్రెస్ టీఆర్ఎస్,పార్టీలు బహుజనులను వాడుకొని వదిలేసే పార్టీలో ఉండకుండా,ఆత్మగౌరంతో బహుజనులు బిఎస్పీ జెండా పట్టాలను పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో యేసేపు,తదితరులు పాల్గొన్నారు.



# ధన్వాడలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**లేచి నిలబడు..లక్ష్యాన్ని చేరే వరకు ఆగకూ- స్వామి వివేకానంద**

**జనవరి-12 ధన్వాడ (ప్రజా జ్యోతి)**

భారత యువతకు మార్గదర్శకుడైన స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలోని చత్రపతి శివాజీ చౌరస్తాలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమాన్ని హిందూ వాహిని ధన్వాడ శాఖ ఆధ్వర్యంలో శిరిడి సాయి వినాయక సాయి యువజన సంఘాలు వివేకానంద యువజన సంఘాలు సంయుక్తంగా నిర్వహించాయి బీజేవైఎం ఏబీవీపీ బీజేపీ కార్యకర్తలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారుఈ సందర్భంగా శిరిడి సాయి యువజన సంఘం నాయకుడు నరసింహులు మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతను జాగృతం చేసిన మహానుభావుడని భారతీయ సంస్కృతి ఆధ్యాత్మికత గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన యోగివర్యుడని పేర్కొన్నారు

అనంతరం బీజేపీ నాయకులు గోవర్ధన్ గౌడ్ ఉదయభాను మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితం యువతకు శక్తి సేవ స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిందని ఆయన ఆలోచనలు దేశ నిర్మాణానికి దిశానిర్దేశం చేస్తాయని తెలిపారుఈ కార్యక్రమంలో సుంకు ఉమేష్ కుమార్ మకాం సురేందర్



మోనాచారి రఘు యాదవ్ మనిగిరి శీను వెంకట రాములు బాలరాజ్ కథలప్ప కాశయ్య నారాయణ సంద రవి చక్రి విష్ణు కురుమూర్తి చరణ్ శివ కళ్యాణ్ తదితర నాయకులు కార్యకర్తలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

**-ఎమ్మెల్యే డాక్టర్. రాజేష్ రెడ్డి**







**నాగర్ కర్నూల్: జనవరి 12ప్రజా జ్యోతి**

పేద ఆర్యవైశ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్. రాజేష్ రెడ్డి అన్నారు సోమవారం జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రహదారి పనులను ప్రారంభించారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదం స్వీకరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలోఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిని సుందరంగా తీర్చి-దిద్దెందుకు కృషి చేస్తానని అందుకు ఆర్యవైశ్యుల సహాయ సహకారాలు కావాలని కోరారు.రహదారి నిర్మాణాలతో వివిధ ప్రవేట్ కంపెనీలు కూడా జిల్లా కేంద్రంలో నెలకొల్పే అవకాశముందని ఆఆ దిశగా ప్రయత్నం చేస్తూన్నానన్నారు.నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్ది రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు తాను కృషి చేస్థానని ఐదు సంవత్సరాలతన పదవీకాలంలో నియోజకవర్గాన్ని విద్యాహబ్ గా తీర్చిదిద్దుతానన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వాసఈశ్వరయ్య,ఆర్యవైశ్య ప్రముఖులు,సేవా సంస్థల నిర్వాహకులు మాజీ కౌన్సిలర్లు,నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**-ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ :జనవరి 12ప్రజా జ్యోతి**

ప్రజలకు నాణ్యమైన విద్యుత్తునుఅందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్యఉద్దేశమని ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని 8వ,వార్డ్ లో ప్రజల విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగాఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి,ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి లు సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ,అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడమే తమ ఉద్దేశమని, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కరిస్తామని అన్నారు.

ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంగా 8వ, వార్డులో విద్యుత్ లోడ్ తో వార్డ్ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలోసమస్యను పరిష్కరించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం



జరిగిందని నిరంతర,నాణ్యమైనవిద్యుత్సరఫరా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వముఖ్య లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు ఆర్టీఏ మెంబెర్ గోపాల్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు,ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు,విద్యుత్ శాఖ అధికారులు, పాల్గొన్నారు.




# మఖ్తల్ మున్సిపల్ వార్డు వారి ఓటర్ లిస్ట్ విడుదల



**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జనవరి 12 (ప్రజా జ్యోతి):**

రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లా మఖ్తల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు అధికారులతో కలిసి మున్సిపల్ ఎలక్షన్- 2026 కు సంభందించిన వార్డుల వారీగా ఓటర్ లిస్ట్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఏఈఈ నాగశివ,మున్సిపల్ సిబ్బంది విష్ణు, అనిల్, ఖాదర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పిరెడ్డి పల్లి గ్రామంలో ఘనంగా వివేకానంద జయంతి...



**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి జనవరి 12 (ప్రజా జ్యోతి)**

భారతదేశ ఔనత్యాన్ని ప్రపంచదేశాలకు చాటిన మహానుభావుడు స్వామి వివేకానంద అని నారాయణపేట మండలం అప్పిరెడ్డి పల్లి గ్రామంలో అన్నారు. సోమవారం స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకొని స్వామి వివేకానంద చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..స్వామి వివేకనందుడు దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచాడని గుర్తు చేశారు.నేటి యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని తెలిపారు.యువత ఆయన ఆశయాలను ఆయన చూపించిన మార్గంలో నడిచి దేశాన్ని అన్ని రంగాలలో ముందువరుసలో నిలబెట్టే జ్ఞానాన్ని సంపాదించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి.వార్డు మెంబర్.రవి. అనిల్. గ్రామ పెద్దలు మాణిక్యప్ప.గావినోళ్ళ సంజీవ్. రంగారెడ్డి.హన్మంత్ ఆదివప్ప. యువకులు శంకర్.రాము.గుడిసె నరసింహ. ఆంజనేయులు.బొక్కనరసింహ.భగవంత్.జైపాల్.గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ప్రజావాణిలో 52 ఫిర్యాదులు నమోదు

**మహబూబ్‌నగర్, జనవరి 12 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 52 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా భూ భారతికి సంబంధించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ వెంకట రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, ఆర్డీవో నవీన్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు 100% వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందించాలి

-వైద్యంతోపాటు పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలి

-త్వరలో 550 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభం

-ఎమ్మెల్యే డాక్టర్.కూచకుళ్ళ రాజేష్ రెడ్డి





**నాగర్ కర్నూల్: జనవరి 12 ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో సోమవారం ఎమ్మెల్యే.డాక్టర్ కూచకుళ్ళ రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పారిశుద్ధ్య కార్మికులు నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా వార్డులలో పారిశుద్ధ్య సేవలను పరిశీలించి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించిన ముగ్గులపోటీని పరిశీలించారు.ఆస్పత్రి ఆవరణలో శుభ్రత పాటిస్తూ చికిత్స పొందుతున్న రోగులకు వైద్యంతో పాటు 100% శుభ్రత ఉండే విధంగా చూడాలనిసూచించారు.నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి వైద్య ఆరోగ్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే అందేవిధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు.నెట్‌వర్క్ సేవలను ఉపయోగించి ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ పారిశుధ్యం,శుభ్రత పాటించాలన్నారు.

**-త్వరలో మెడికల్ కళాశాల పనులు ప్రారంభం**

-జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల వద్ద 550 పడకల ఆసుపత్రి పనులు త్వరలో ప్రారంభం చేస్తామని ఎమ్మెల్యే డా.రాజేష్ రెడ్డి అన్నారు.మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్ ఆధ్వర్యంలో కార్మికులకు నిర్వహించిన ముగ్గులపోటీల విజేతలకు ప్రథమ స్థాయిలో నిలిచిన వారికి 8 వేల నగదు,ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి 6 వేల నగదు,మూడో స్థానంలో నిలిచిన వారికి 4 వేల, 5వ స్థానంలో నిలిచిన వారికి 2 వేలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు,ఆర్టీఏ మెంబెర్ గోపాల్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, జక్కరాజ్ కుమార్ డిప్యూటీ మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్,రేసిడెంట్ మెడికల్ అధికారులు డాక్టర్ రవిశంకర్, డాక్టర్ హనుమంతరావు,డాక్టర్ రోహిత్, డాక్టర్ అజీమ్,డా.సూర్యనారాయణ, డాక్టర్ కోటేశ్వర్ ,నర్సింగ్ సూపర్డెంట్ మంజుల,హెడ్ నర్సులు పద్మ,నర్సింగ్ అధికారి ఎం.ఆనంద్,రూపా,రాణి, జానకి దేవి,జ్ఞానేశ్వరి,హెల్ప్ డెస్క్ ఇంచార్జ యాదగిరి,ఆసుపత్రి వైద్యులు,సానిటరీ పర్యవేక్షకులు,సిబ్బంది పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఇటిక్యాల ఎస్ఐ



**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జనవరి 12:**

అలంపూర్ నియోజకవర్గం ఇటిక్యాల గ్రామ మండల శివారులోని ఇటిక్యాల నుండి పొగాకు కంపెనీ కి వెళ్ళు రోడ్ లో ఇటిక్యాల గ్రామ సమీపాన ఉన్న వాగుపై కాంక్రీట్ పోయి గుంతలు ఏర్పడి ఉండగా అది గమనించిన ఇటిక్యాల ఎస్ఐ కె.రవి లోడ్ కంకరతో కూడిన డస్ట్ ను తెప్పించి అక్కడ జేసీబీ సహాయంతో వేసి గుంతలను పూడ్చడం జరిగినది.ఎస్ ఐ తో పాటు ఏ.ఎస్.ఐ ఆర్.సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన జములమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ

**చిన్నంబావి జనవరి 12 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలంలోని పెద్ద మారూర్ గ్రామంలో గ్రామ దేవత జములమ్మ నూతన గుడి నిర్మాణానికి సోమవారం వేద పండితుడు కుమారస్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుడి నిర్మాణ దాత జగ్గారి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా జగ్గారి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల గ్రామంలో మైసమ్మ గుడిని నూతనంగా నిర్మించుకోవడం ఎంతో శుభకరమైన సందర్భమని తెలిపారు. పెద్ద మారూర్ గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు గ్రామానికి దూరంగా ఉన్న పెద్ద దగడ చివరలో ఉన్న జములమ్మ గుడికి వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఆ క్రమంలోనే మన గ్రామంలోనే జములమ్మ గుడిని నిర్మించుకోవాలనే సంకల్పం కలిగిందని అన్నారు.గ్రామ ప్రజల ఆకాంక్ష మేరకు, వారి ఆహ్వానం మరియు సహకారంతో నేడు నూతన జములమ్మ గుడి నిర్మాణానికి పునాది వేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. గ్రామ ప్రజలకు తాను ఇచ్చిన హామీ మేరకు, వారి సంపూర్ణ సహకారంతో గుడి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, త్వరలోనే భారీ ఎత్తున పండుగ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని



హామీ ఇచ్చారు.ఈ భూమి పూజ కార్యక్రమంలో గ్రామ, రైతులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని జములమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో నూతన గుడి నిర్మాణం జరగనుండటంతో గ్రామమంతా భక్తి వాతావరణంతో మార్మోగింది.గ్రామ సంక్షేమం, ప్రజల శ్రేయస్సు కోసం జములమ్మ కృప ఎల్లప్పుడూ ఉండాలని గ్రామస్తులు ప్రార్థనలు చేశారు.

# కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది




**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి జనవరి 12 (ప్రజా జ్యోతి)**

కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజా కార్మిక ,కర్షక ,కూలీల వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నారాయణపేట జిల్లా కార్యదర్శి గోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బాల్ రామ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ విమర్శించారు సోమవారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాయడమే కాక రాష్ట్రల హక్కులను హరిస్తూ చట్టాలను చేస్తున్నదని విమర్శించారు కార్మికులను కట్టు బానిసత్వంలోకి నెట్టే 4 లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని విమర్శించారు.

2005 సంవత్సరంలో యూపీఏ ప్రభుత్వం గ్రామీణ పేదలకు ఉపాధి గ్యారెంటీ చేసేందుకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీసుకురాగా నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం పేద కూలీల పొట్టను కొట్టేందుకు జిరాంజీ చట్టాన్ని తెచ్చారని విమర్శించారు.

జాతీయ విత్తన ,విద్యుత్ సవరన బిల్లులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మిక కార్మిక కర్షక కూలీల హక్కులను కాలు రాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తున్నట్లు వారు తెలిపారు.

అందులో భాగంగానే జనవరి 17న నారాయణపేట జిల్లా వ్యాప్తంగా జీపు యాత్రలు నిర్వహించి జనవరి 19న కార్మిక కర్షక ఐక్యత దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన సభలు చేయనున్నమని తెలిపారు .

ఈ నిరసన కార్యక్రమంలో జిల్లాలో ఉన్న కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రజా వ్యతిరేక విధానాల నిరసనలలో భాగస్వామ్యం కావాలని కోరారు

# బాల్యవివాహాల నిర్మూలన ట్రాఫిక్ నిబంధనల గూర్చి అవగాహన

**గద్వాల (ప్రజాజ్యోతి) జనవరి 12:**

గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గద్వాల మండలం గోనుపాడు గ్రామంలోని పంచాయతీ ప్రాంగణంలో నిర్వహించిన సమగ్ర అవగాహన సదస్సులో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజేందర్ మాట్లాడుతూ.. జాతీయ యువజన దినోత్సవం,బాల వివాహ ముక్త భారత్ అభియాన్ అలాగే ట్రాఫిక్ నియమాలు రోడ్డు భద్రత అంశాలపై సమగ్ర అవగాహన శిబిరం నిర్వహించబడింది. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానందుల ఆశయాలు,యువత దేశాభివృద్ధిలో పోషించాల్సిన పాత్ర క్రమశిక్షణ,సామాజిక బాధ్యతలపై వివరించారు.యువత చైతన్యంతోనే సమాజంలో మార్పు సాధ్యమని పేర్కొన్నారు.అదేవిధంగా మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, వాటి వల్ల కలిగే శారీరక, మానసిక,సామాజిక సమస్యలను వివరించారు.ఫోక్సోచట్టం పౌరుల హక్కుల గురించి వివరించారు.అలాగే బాల వివాహ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు పిల్లల ఆరోగ్యం,విద్య భవిష్యత్తుపై పడే ప్రభావం గురించి వివరించారు. బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం ఉన్న న్యాయ పరమైన శిక్షలు గ్రామస్థుల సమిష్టి బాధ్యత గురించి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలు రోడ్డు భద్రత అంశాలపై మాట్లాడుతూ,హెల్మెట్ సీట్‌బెల్ట్ వాడకం మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ట్రాఫిక్ సంకేతాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవల సంస్థ అధికారులు పాల్గొని, ఉచిత న్యాయ సేవల గురించి ప్రజలకు వివరించారు.ప్రజల సందేహాలకు సమాధానాలు ఇచ్చి, అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాములమ్మ, ఉప సర్పంచ్ సత్యమ్మ, గ్రామ పెద్దలు శ్రీనివాస్ గౌడ్,నాగరాజు,సుదర్శన్, పారా లీగల్ వాలంటీర్ గిరిబాబు,గ్రామస్థులు, యువత,మహిళలు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# మన్యంకొండ బ్రహ్మోత్సవాలకు సమగ్ర ఏర్పాట్లు

**- ఫిబ్రవరి 28 నుంచి మార్చి 5 వరకు వేడుకలు**
**- భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు : అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్**




**మహబూబ్‌నగర్, జనవరి 12 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
ఈ నెల 28 నుంచి మార్చి 5 వరకు నిర్వహించనున్న తెలంగాణలోనే 'చిన్న తిరుపతి'గా పేరుగాంచిన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సోమవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, శానిటేషన్, టాయిలెట్లు, బందోబస్తు, రద్దీ నియంత్రణ వంటి మౌలిక సదుపాయాలు పకడ్బందీగా కల్పించాలని సూచించారు. స్వామివారి దర్శనం సులభంగా జరిగేలా చూడాలని, ఎలాంటి అనూహ్య సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు వివిధ కమిటీలను ఏర్పాటు చేసి, ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని అన్నారు. వివిధ ముఖ్య శాఖల అధికారులతో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతి శాఖ నుంచి ఒక అధికారిని నియమించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు.బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన ఫిబ్రవరి 1న స్వామివారి గరుడ వాహన సేవ, రాత్రి రథోత్సవం ఉన్నందున ఆ రోజుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఇతర రద్దీ రోజుల్లో కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ ద్వారా సరిపడా బస్సులు నడపడంతో పాటు కొండపైకి మినీ బస్సుల సౌకర్యం కల్పించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా కొండపైన, కొండ దిగువన అలివేలు మంగతాయారు దేవాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు, డాక్టర్లు, మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ట్రాన్స్కో ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసి, అవసరమైన చోట జనరేటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అగ్నిమాపక శాఖ కొండపైన, దిగువన అవసరమైన అగ్నిమాపక సాధనాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.
జాతర సందర్భంగా దేవాలయం పరిసర ప్రాంతాల్లో మద్యపానాన్ని నిషేధించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి ద్వారా అవసరమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, గ్రామీణ నీటి సరఫరా శాఖ భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. శానిటేషన్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని డీపీఓను ఆదేశించారు. ముఖ్య రద్దీ రోజుల్లో కోనేరు వద్ద స్విమ్మర్లను ఏర్పాటు చేయాలని మత్స్య శాఖ అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాల సవ్య నిర్వహణ కోసం శాంతిభద్రత కమిటీ, ఫెస్టివల్ కమిటీ, వాటర్, శానిటేషన్ కమిటీ, ఫుడ్ కమిటీ, మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మన్యంకొండ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మన్యంకొండ దేవాలయ కమిటీ వంశపారంపర్య ధర్మకర్త అలహరి మధుసూదన్, సహాయ కమిషనర్-- కార్యనిర్వహణ అధికారి జి. శ్రీనివాస రాజు, అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, జడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, ఆర్డీవో నవీన్, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై వాహనదారులకు విస్తృత అవగాహన






**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జనవరి 12:**
జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పుల్లూరు టోల్ ప్లాజా వద్ద సోమవారం రోజున ఉదయం పోలీస్ శాఖ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆర్టీవో శాఖలు సంయుక్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఘనంగా నిర్వహించాయి. ఎన్హెచ్ 44 మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులను నిలిపి, వారికి రోడ్డు భద్రతకు సంబంధించిన ముఖ్యమైన నియమాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ ధరించకపోతే ప్రాణాలకు ముప్పు తప్పదని అధికారులు వివరించారు ముఖ్యంగా అధిక వేగం మద్యం సేవించి వాహనం నడపడం రాంగ్ రూట్ డ్రైవింగ్ మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి అలవాట్లు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని స్పష్టంగా తెలియజేశారు. హెల్మెట్ ధరించని కొందరు ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు అందజేయడం ద్వారా భద్రత పట్ల ప్రోత్సహించారు. అలాగే కార్లు, లారీలు, ఆటోలు తదితర వాహనాలకు రాత్రివేళ స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లను అతికించారు.
వాహనదారులకు గులాబీలు అందజేసి నిదానంగా జాగ్రత్తగా ప్రయాణం చేయాలంటూ స్నేహపూర్వకంగా సూచనలు అందించారు. అదేవిధంగా ఎన్హెచ్--44పై విధులు నిర్వహిస్తున్న రోడ్ వర్కర్స్ సిబ్బందికి రిఫ్లెక్టివ్ సేఫ్టీ జాకెట్లు పంపిణీ చేసి వారి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. రోడ్డు భద్రత అనేది కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని ప్రతి వాహనదారి తన బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉందని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవిబాబు ఉండవల్లి ఎస్సై ఆర్. శేఖర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్, రమేష్, నేషనల్ హైవే అథరిటీ ప్రతినిధి శ్రీధర్ తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తోగాపూర్‌లో ఘనంగా స్వామి వివేకానంద జయంతి

**మహబూబ్‌నగర్, జనవరి 12 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
కోస్గి మండల పరిధిలోని తోగాపూర్ గ్రామంలో స్వామి వివేకానంద 164వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందుని బోధనలను స్ఫూర్తిగా తీసుకొని యువత దేశభక్తి, శివభావనలను పెంపొందించుకోవాలని గ్రామ సర్పంచ్ బి. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జయంతి వేడుకలలో భాగంగా గ్రామ యువతను ఆకట్టుకునేలా సర్పంచ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. మొత్తం ఎనిమిది జట్లు పాల్గొనే ఈ పోటీలు సోమవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగనున్నట్లు సర్పంచ్ తెలిపారు. పోటీలలో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్‌తో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ యువకులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.



## కొల్లాపూర్‌లో మార్పుకు నాంది, 5వ వార్డులో బీజేపీకి వెల్లువెత్తిన ప్రజా మద్దతు

**-90 శాతం ప్రజలు బీజేపీకే ఓటేస్తామంటూ భరోసా కురువ చిన్న మల్లయ్య**



**చిన్నంబావి, జనవరి 12(ప్రజాజ్యోతి):**
రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కొల్లాపూర్‌లో అధికార మార్పు ఖాయమని సూచించేలా 5వ వార్డులో బీజేపీ నిర్వహించిన ఇంటింటి ప్రచారం రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి కురువ చిన్న మల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని బీజేపీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు బీజేపీ నాయకులు నరేష్ ఆచారి, రమేష్, వనపర్తి జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మేకల చెన్నయ్య యాదవ్, చిన్నంబావి మండల బీజేపీ జనరల్ సెక్రటరీ నంది సత్యారెడ్డి, డీవన్ రాము, సాయిబాబా, విష్ణు, జోగు మధు, డి మహేష్, జి లోకేష్, పవన్, చింటూ, పి మహేష్ సహా 20 మందికి పైగా బీజేపీ కార్యకర్తలు విస్తృతంగా పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు గత మున్సిపల్ పాలన వైఫల్యాలను ప్రజల ముందుంచి ప్రశ్నించారు.
తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, పేదల సంక్షేమం వంటి కీలక అంశాల్లో కొల్లాపూర్ మున్సిపాలిటీ పూర్తిగా విఫలమైందని ప్రజలే బహిరంగంగా ఆరోపించారు. ఈసారి ఈ అవినీతి పాలనకు గుణపాఠం చెప్పాలని ప్రజలు గట్టిగా నిర్ణయించుకున్నారని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కురువ చిన్న మల్లయ్య మాట్లాడుతూ,"5వ వార్డులో దాదాపు 90 శాతం మంది ప్రజలు ఈసారి బీజేపీకే ఓటేస్తామని, కొల్లాపూర్ మున్సిపాలిటీని అభివృద్ధి బాటలో నడిపే బాధ్యత బీజేపీకే అప్పగిస్తామని స్పష్టంగా చెప్పారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు, అవినీతి రాజకీయాలకు గుడ్‌బై చెప్పే రోజు దగ్గర పడింది" అని అన్నారు. ఈ ప్రచారానికి ప్రజల నుంచి ఊహించని స్థాయిలో మద్దతు లభించడంతో ఇతర పార్టీలలో ఆందోళన మొదలైందని రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి. "కొల్లాపూర్‌లో ఈసారి బీజేపీ గాలి స్పష్టంగా వీచుతోంది" అని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు కొల్లాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి, పట్టణ అభివృద్ధికి బలమైన పాలన ఇవ్వాలని ప్రజలను కోరారు.

## కొల్లాపూర్ మున్సిపల్ ఓటర్ల తుది జాబితా విడుదల బహిరంగ ప్రదర్శన.

**కొల్లాపూర్ జనవరి 12 ప్రజా జ్యోతి**
కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 19 వార్డుల చెందిన మొత్తం ఓటర్లను తుది జాబితా చేసి ఉన్నతాధికారుల ఆదేశాలను మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ పి చంద్రశేఖర్ రావు విడుదల చేశారు.. ఈ సందర్భంగా కమిషనర్ పి చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ కొల్లాపూర్ మున్సిపాలిటీ కి సబంధించిన తుది వార్డు వారీ గా ఎలక్ట్రోరోల్స్ ( ఓటర్ జాబితా) ను కొల్లాపూర్ మున్సిపాలిటీ ముందు విడుదల చేసి కార్యాలయం ఆవరణలో బహిరంగ ప్రదర్శన చేయడం జరిగిందని స్పష్టం చేశారు.. కొల్లాపూర్ మున్సిపాలిటీ లోని 19 వార్డుల వారీగా మొత్తం ఓటర్ల జాబితా 19.356 ఉందని ఇందులో పురుష ఓటర్లు9.593 మహిళా ఓటర్లు9.763 ఉన్నారని మొత్తం 38 పోలింగ్ కేంద్రాలుగా విభజించి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు కమిషనర్ పి చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు.. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు మున్సిపల్ ప్రజలు తుది ఓటర్ల జాబితాను చూసుకోగలరని ఆయన కోరారు.. ఈ కార్యక్రమంలో టిపిఓ మనోజ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# షీటీమ్స్ తో మహిళలకు భద్రత

**-షీ -టీమ్ ఇంచార్జి ఎస్సై రజిత**
**-మహిళలను వేదిస్తే కఠిన చర్యలు**
**-ఏ ఎస్సై విజయలక్ష్మి**

**నాగర్ కర్నూల్ : జనవరి 12ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ఆదేశాల మేరకు కల్వకుర్తి ఆర్టిసి బస్ స్టాండ్ లోసోమవారం షీ టీం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షి-టీమ్ ఇంచార్జీ రజిత సబ్ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రయాణికులు బస్టాండ్లలో,రద్దీ ప్రదేశాలలో బస్సుల్లో ప్రయాణించే సందర్బంలో జాగ్రత్తగా ఉండాలని,మహిళలతో అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తించినా వెంటనే షి టీమ్ ను సంప్రదించాలని,మహిళలు,బాలికలు,విద్యార్థినిలు బస్టాండ్లో,మార్కెట్లో,రద్దీ ప్రదేశాలలో వేధింపులకు గురైనట్లయితే వెంటనే జిల్లా షీ టీమ్ నెంబర్ 8712657676 లేదా డయల్ 100 కు పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,ఎలాంటి వేధింపులకైన గురయ్యే మహిళలు షీటీమ్ కు పిర్యాదు చేయదలచుకునే మహిళలు అవకాశాన్ని వినియోగించుకోవాలని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని,మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలన్నారు.

**మహిళలను వేదిస్తే కఠిన చర్యలు:-ఏ ఎస్సై విజయలక్ష్మి**

అనంతరం ఏ ఎస్సై విజయలక్ష్మి మాట్లాడుతూ ఎవరైనా మహిళలకు వేధించినా,అవహేలనగా మాట్లాడి ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే



జిల్లా షీ-టీమ్ నెంబర్ 8712656935 కు లేదా 100 కు ఫిర్యాదు చేసినచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

షీ-టీమ్స్ ప్రాముఖ్యత,నిర్వహించే విధుల పట్ల,మానవ అక్రమ రవాణా,ఫోక్సో చట్టాలు,బాల్య వివాహాలు వాటి పరిణామాలు,ఈ-విటిజింగ్,టి-ఆప్ తదితర అంశాలు,సోషల్ మీడియా,సైబర్ క్రైమ్స్,డయల్ 100,సమాజ రుగ్మతలు,సమాజంలో జరుగుతున్న నేరాలు,వాటి రక్షణ అంశాలు,మహిళలు,పిల్లల రక్షణ చట్టాలు,సోషల్ మీడియా వల్ల జరుగు నష్టాలు లాభాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో షి టీమ్ కానిస్టేబుల్ వెంకటయ్య,వెంకట్ స్వామి,పద్మావతి,కానిస్టేబుల్స్ వెంకట్ నాయక్,గోపాల్ పాల్గొన్నారు.

# కొత్త మున్సిపల్ ఆఫీస్ పనులను పర్యవేక్షించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**కొల్లాపూర్ జనవరి 12 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. సోమవారం ఆయన కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కొత్త మున్సిపల్ ఆఫీస్ పనులు పర్యవేక్షించారు త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.కార్యక్రమంలో కొల్లాపూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు మాజీ చైర్మన్ మేకల రమ్య ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద 163 వ జయంతి



**కొల్లాపూర్ జనవరి 12 ప్రజా జ్యోతి**

పెంట్లవెల్లి మండలంగోపాలపురం గ్రామంలో స్వామి వివేకానంద 163-వ జయంతి వేడుకల సందర్భంగా గ్రామ వివేకానంద యువజన సంఘం యుపిఎస్ పాఠశాల ఆవరణలో చిత్రపటనికి పూలమాలలు సమర్పించి 163వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు యాదగిరి గౌడ్ గ్రామ వార్డ్ మెంబర్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# జేపీఎన్ ఇంజనీరింగ్ కాలేజీలో సంక్రాంతి సందడి

**- గ్రామీణ సంప్రదాయాలకు పట్టం**
**ముఖ్య అతిథి గా పాల్గొన్న జబ్బర్దస్త్ ఫేం సుధాకర్**

**మహబూబ్‌నగర్, జనవరి 12 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో సంక్రాంతి పండుగను గ్రామీణ సంప్రదాయాల నడుమ ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ కే.ఎస్. రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు జబ్బర్దస్త్ ఫేం సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు.గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా ముగ్గుల పోటీలు, గ్రామీణ ప్రాంత వాతావరణాన్ని ప్రతిబింబించేలా గుడిసెల ఏర్పాటు, గంగిరెద్దుల ఆటలు, కోడిపందేల ప్రదర్శనలు నిర్వహించి కళాశాల ప్రాంగణాన్ని పల్లె సంబరాల మాదిరిగా ముస్తాబు చేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొనగా, డీజే సంగీతానికి డాన్స్‌లు, ఆటపాటలతో సంక్రాంతి సంబరాలు మరింత జోరుగా సాగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సుధాకర్ మాట్లాడుతూ, గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను యువతకు చేరువ చేసేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పండుగలు కేవలం ఆనందానికే కాకుండా మన సంస్కృతిని గుర్తుచేసే వేదికలుగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. కళాశాల ఛైర్మన్ కే.ఎస్. రవికుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, సామాజిక ఐక్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో సంక్రాంతిని ఈ విధంగా జరుపుకున్నామని తెలిపారు. విద్యతో పాటు సంస్కృతికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ





కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని సంక్రాంతి వేడుకలను విజయవంతం చేశారు.

# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**చిన్నంబావి,జనవరి 12(ప్రజాజ్యోతి )**

చిన్నంబావి మండలంలోని అయ్యవారిపల్లి మరియు చెల్లెపాడు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మంత్రి జూపల్లి కృష్ణారావు గారి సహకారంతో జరిగింది.చెల్లెపాడు గ్రామానికి చెందిన కామిరెడ్డి కళావతమ్మకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.60,000 చెక్కును అందజేశారు.అదే గ్రామానికి చెందిన మాదం విజయ గారికి రూ.32,500 (ఎల్ఓసి) చెక్కును,మేకల బిచ్చన్నకు రూ.15,000 మేకల మాధవికి రూ.18,500 విలువైన చెక్కులను.అందజేశారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం సహాయ నిధిని పేద ప్రజలకు ఒక వరంగా అభివర్ణిస్తూ, ముఖ్యమంత్రి గారికి మరియు మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జగదీష్, మాజీ సర్పంచ్ తిరుపతయ్య, మండల యువజన కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ విభీషణ్, రంగారెడ్డి, రామకృష్ణ, పుల్లన్న, శ్రీను, రామ్మోహన్, కృష్ణ, గంగన్న, మనోహర్ తదితరులు పాల్గొని బాధితులకు చెక్కులు అందజేశారు.





# కొత్తూరులో అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు**

**మహబూబ్‌నగర్, జనవరి 12 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

మిడ్జిల్ మండలం కొత్తూరు గ్రామంలో కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణాను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం తహసీల్దార్ స్వప్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యనారాయణ గుప్తా, గ్రామ సర్పంచ్ కావలి రాములు, ఉపసర్పంచ్ అర్జున్ యాదవ్ మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా కారణంగా గ్రామంలోని రహదారులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, ప్రజలకు నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం కూడా ఉందని పేర్కొన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని వారు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ స్వప్న స్పందిస్తూ, అక్రమ ఇసుక రవాణాపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వప్నను కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు చింతకాయల చంద్రశేఖర్, నాయకులు శివలతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# పోలీస్ ప్రజావాణికి 8 ఫిర్యాదులు

## -ప్రజవాణి సేవలను వినియోగించుకావాలి
## -జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్

**నాగర్ కర్నూల్:జనవరి 12ప్రజా జ్యోతి**

పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగాసోమవారం నిర్వహించిన ఎస్పీ ప్రజావాణికార్యక్రమంలో ఫిర్యాదు దారుల నుండి 08 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్వీకరించారు.ఫిర్యాదుదారుల సమస్యలనువిని వాటిని చట్టప్రకారం పరిష్కరించాలనిసంబందిత అధికారులకు సూచనలు చేశారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 08ఫిర్యాదులలో భూమికి సంబంధించిన అర్జీలు 04, కుటుంబ తగాదాలు 02,తగు న్యాయం అర్జీలు 02 వచ్చినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. స్వీకరించిన ఫిర్యాదలను పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల యొక్క సి.ఐ మరియు డీఎస్పీ లకు ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలియజేసి,వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్పీసూచించారు.ప్రతి సోమవారం కార్యక్రమాన్నినిర్వహిస్తామని,జిల్లా ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా మధ్య వ్యక్తుల ప్రమేయం,పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా ప్రజావాణి సేవలను




వినియోగించుకోవాలని,పోలీసులు ప్రజలకు చేరువయ్యేలా శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

# ప్రజాప్రతినిధులు-అధికారుల సమన్వయమే అభివృద్ధికి పునాది

## – సమన్వయ లోపంతో ఒక్క పనీ నిలిచిపోకూడదు
## : జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్‌నగర్, జనవరి 12 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

ప్రజాప్రతినిధులతో సమన్వయంగా పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. అధికారులూ ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపం వల్ల ఏ అభివృద్ధి పనీ ఆగిపోకూడదని ఆమె స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో పాటు మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి. మధుసూదన్ రెడ్డి, నూతనంగా ఎన్నికైన సర్పంచులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిపై స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి పథకాల కింద మంజూరవుతున్న నిధులపై ప్రజాప్రతినిధులకు పూర్తి సమాచారం అందాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి స్పందించిన డీఆర్‌డీఏ అధికారులు, స్వచ్ఛ భారత్ పథకం కింద 233 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు లభించాయని, ఒక్కో మరుగుదొడికి రూ.52 వేల చొప్పున నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే విద్యాశాఖ అధికారులు, మరుగుదొడ్లు లేని 139 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించామని, ఒక్కో యూనిట్‌కు రూ.2 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వివరించారు.

దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, గృహ నిర్మాణం, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు, పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన ఫైళ్లను వేగంగా క్లియర్ చేయాలని అధికారులకు సూచించారు. బాధ్యతాయుతంగా పనిచేసి నిరంతర ఫాలోఅప్‌తో పనులు పూర్తి చేయాలని అన్నారు. గ్రామ, మండల స్థాయిల్లో సీసీ రోడ్లు, ప్రభుత్వ



పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, కాంపౌండ్ గోడలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర అభివృద్ధి పనులకు ఎంపీడీవోల ద్వారా ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యేలు సూచించారు. ప్రతిపాదించిన అన్ని అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తామని వారు హామీ ఇచ్చారు. సమావేశంలో పాల్గొన్న సర్పంచులకు గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. ఈ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఇన్‌చార్జి డీపీఓ వెంకట్ రెడ్డి, డీఈఓ ప్రవీణ్ కుమార్, ఉద్యానవన శాఖ డీడీ వేణుగోపాల్, డీఆర్‌డీఓ నరసింహ, మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్ కుమార్, ఆర్ అండ్ బీ, హౌసింగ్, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి వేడుకల్లో వాలీబాల్ టోర్నమెంట్

## ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన ప్రారంభం



**చిన్నంబావి, జనవరి 12(ప్రజాజ్యోతి):**

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చిన్నంబావి మండల కేంద్రంలో ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడా టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఫౌండర్ కారంకి బ్రహ్మం హాజరై క్రీడలను ప్రారంభించారు.మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు ఈ వాలీబాల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పలువురు బీఆర్ఎస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధులు, మండల నాయకులు కూడా పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు పరిమళ్ళ ప్రకాష్, కే.మధు, బోరెల్లి రవికుమార్ సమక్షంలో ముందుండి నిర్వహించారు. ఈరోజు మొత్తం 14 టీములు పోటీల్లో పాల్గొనగా, వాటిలో నుంచి నాలుగు టీములు సెమీ ఫైనల్‌కు అర్హత సాధించాయి. సెమీ ఫైనల్ మ్యాచ్‌లు మంగళవారం (జనవరి 13) నిర్వహించగా, ఫైనల్‌కు చేరిన జట్లకు ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తగిన బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు గజ్జె ఈదన్న యాదవ్, నిరంజన్ రెడ్డి, రామన్ గౌడు, మాజీ సర్పంచ్ రంజిత్ కుమార్, చిన్నమారు సర్పంచ్ మద్దూరి శంకర్, మాజీ ఉపసర్పంచ్ ఆనంద్ యాదవ్, సుధాకర్ రెడ్డి, చెల్లెపాడు సర్పంచ్ పెద్ద నరసింహ, గంగేశ్వర్ గౌడ్, గూడెపు శివారెడ్డి తదితరులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహ పరిచారు.వాలీబాల్ మ్యాచ్‌లు ఉత్సాహభరితంగా సాగుతూ క్రీడాభిమానులను ఆకట్టుకున్నాయి. మిగిలిన నాలుగు టీముల మధ్య జరిగే ఫైనల్ పోటీలు మరింత ఉత్కంఠభరితంగా ఉండనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# సమాజంలో మీడియా పాత్ర గొప్పది : కలెక్టర్

**నాగర్ కర్నూల్: జనవరి 12ప్రజా జ్యోతి**

సమాజంలో మీడియా పాత్ర గొప్పదని ప్రజలను చైతన్యపరిచేది మీడియా రంగమే అని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బధావత్ సంతోష్ అన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో 19 టీవీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మీడియా పాత్ర కీలకమైనదని,19 టీవీ ఛానెల్ మరింత అభివృద్ధి చెందాలని అన్నారు.జిల్లా ప్రజలందరికీ మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఎ-143 జాతీయ నాయకులు జెమినీ సురేష్,జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు కానాపురం ప్రదీప్,టియు డబ్ల్యూ జే (హెచ్ 143)రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, 99 టీవీ ప్రతినిధి ప్రదీప్,మెగా9 టీవి రామకృష్ణ, దిశ బాలు,మహ్మద్,19 టీవీ సీఈవో శేఖర్, నరేందర్ గౌడ్,మణికిషోర్, పాల్గొన్నారు.



# ఎదిరలో వివేకానంద జయంతి వేడుకలు

## -యువతకు చైతన్య దీపంగా అరైస్ అవేక్ ఫౌండేషన్
## – సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చిన భానుచందర్‌కు సన్మానం
## – ఇనుప కండరాలు ఉక్కు నరాలు, వజ్ర సంకల్పమే మా లక్ష్యం : ఫౌండర్ రమాకాంత్ రెడ్డి

**మహబూబ్‌నగర్, జనవరి 12 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

“మందలో ఒకరిగా ఉండకౌ వందలో ఒకరిగా నిలవడానికి ప్రయత్నించు” అంటూ యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన మహానుభావుడు స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలను ఎదిర 5వ డివిజన్ ఎదిరలో అరైస్ అవేక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు, డివిజన్ నాయకులు వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతీయ యువజన దినోత్సవంతో పాటు అరైస్ అవేక్ ఫౌండేషన్ నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా ఫౌండేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డివిజన్ పెద్దలు, యువకులు వివేకానందుని బోధనలు నేటి యువతకు ఎంతగానో అవసరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అరైస్ అవేక్ ఫౌండర్ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ, “భారతదేశాన్ని అర్థం చేసుకోవాలంటే వివేకానందుని చరిత్ర చదవాలని రవీంద్రనాథ్ ఠాగూర్ అన్న మాటలు అక్షరాల నిజం. 39 సంవత్సరాలే జీవించిన వివేకానందుడి మాటలు నేటికీ, రాబోయే వందల ఏళ్లకు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయి” అని అన్నారు. “లెండి, మేల్కొనండి, గమ్యం చేరే వరకు విశ్రమించకండి” అనే సూక్తిని స్ఫూర్తిగా తీసుకుని, ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువతతో నాలుగు సంవత్సరాల క్రితం జనవరి 12న అరైస్ అవేక్ ఫౌండేషన్‌ను ప్రారంభించామని తెలిపారు. గత నాలుగేళ్లుగా రక్తదాన శిబిరాలు, జాబ్ మేళాలు, ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు--సైన్ బోర్డుల ఏర్పాటు, కరోనా సమయంలో రెండు దఫాలుగా మూడు వేల కుటుంబాలకు పైగా మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసినట్లు వివరించారు. ఒక సీసీ కెమెరా ఇరవై మంది పోలీసుల నిఘాకు సమానమని పేర్కొంటూ, ఎదిరలో భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ఏర్పాటుకు ఫౌండేషన్ పూనుకుందని తెలిపారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలను స్పాన్సర్ చేయడానికి ముందుకొచ్చిన భానుచందర్ సేవలను ప్రశంసిస్తూ ఫౌండేషన్ సభ్యులు, డివిజన్ పెద్దలు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం డివిజన్ పెద్దలు పెద్ద కృష్ణయ్య, భానుచందర్, ఫౌండేషన్ సభ్యులు శివకుమార్ గౌడ్, నాగరాజు వివేకానందుని జీవితం, భారత సంస్కృతి, దేశ ప్రతిష్టను ఆయన ప్రపంచానికి ఎలా చాటారో వివరించారు. చివరగా అరైస్ అవేక్ ఫౌండేషన్ సభ్యులు ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెంకట రాఘవ, నరేష్, కర్నె రవి, రమేష్, కమ్మరి రవి, కర్నె నరేష్, సాత్విక్ రెడ్డి, సంతోష్, డివిజన్ సభ్యులు నవకాంత్ రెడ్డి, సూద నర్సింలు, అల్లి ఎల్లయ్య, అల్లి శేఖర్, టంకరి మోహన్, రవి, చంద్రకాంత్ రెడ్డి, బుర్ల ఆంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# మునిసిపల్ ఎన్నికల్లో కొల్లాపూర్ కోటపై కమలం పువ్వు జెండా ఎగరడం ఖాయం

**బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఎల్లేని సుధాకర్ రావు**

**అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్**





**కొల్లాపూర్ జనవరి 12 ప్రజా జ్యోతి**

మునిసిపల్ పట్టణ కేంద్రం ఎన్టీఆర్ చివరస్త దగ్గర భారతీయ జనతా పార్టీ స్వామి వివేకానంద 163–వ జయంతి వేడుకలను పురస్కరించుకొని సెంటర్లో మీటింగ్ ఏర్పాటు చేసి కార్యకర్తలతో మునిసిపల్ ఎన్నికల గురించి మాట్లాడుతున్న అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జిల్లా మాజీ అధ్యక్షులు ఎల్లేని సుధాకర్ రావు. మున్సిపల్ కేంద్రంలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల పైన కార్యకర్తలతో మాట్లాడుతున్న జిల్లా మాజీ అధ్యక్షులు ఎల్లేని సుధాకర్ రావు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆయన గురించి వివరించారు

అనంతరం కొల్లాపూర్ ప్రాంతాన్ని త్రిబుల్ ఇంజిన్ గా భారతీయ జనతా పార్టీ ముందుకు నడుపుతున్న సందర్భంగా రాబోయే రోజుల్లో కొల్లాపూర్ కోటపై కమలం పువ్వు జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు వివరించారు కొల్లాపూర్ కు రైలు పూత త్వరలోనే వినిపిస్తుందని మాట్లాడారు మునిసిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించి కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్ ను కైవసం చేసుకోవాలని కార్యకర్తలతో వివరించారు. అధికారం ఉన్న లేకపోయినా కొల్లాపూర్ కు నేను ఎన్నో అభివృద్ధి పనులు చేశానని వివరించారు ఐకాన్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం మరియు జాతీయ రహదారి ఇంకా అనేక పరిశ్రమలు కూడా ముందు ముందు తీసుకు వస్తానని కొల్లాపూర్ ప్రాంత ప్రజలకు వివరించారు. మున్సిపల్ పట్టణ లో 11 11వ వార్డులో మునిసిపల్ ఎన్నికల సందర్భంగా వార్డులోని సమస్యలను వార్డులో తిరిగి ప్రజలను అడిగి తెలుసుకున్న సుధాకర్ రావు. రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో కొల్లాపూర్ కోటపై కమలం పువ్వు జండా ఎగరవేయాలని వార్డులో ప్రజలకు వివరించారు ఎనిమిది సంవత్సరాలు నాకు పదవి లేకపోయినా ప్రజల పక్షాన నిలబడి నిరంతరము ప్రజల సమస్యల పైన పోరాటం చేస్తూనే ఉన్నాను ప్రజలకు ప్రజా సంక్షేమ పథకాలు అందే విధంగా భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన ఉందని మాట్లాడారు.

**అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ.**

స్వామి వివేకానంద 163 వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఎన్టీఆర్ చివరస్త సెంటర్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు. అనంతరం

కొల్లాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు అందరు కలిసి కంకణం కట్టుకుని కడప కడప తిరిగి ప్రజల కడుపులో జొరవడి కాళ్లు వేళ్ళు మొక్కి రెండు సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ పరిపాలన గురించి వివరించండి మరియు గతంలో పదేళ్లు టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేసింది అనేది క్షుణ్ణంగా ప్రజలకు వివరించి ముందుగా కుటుంబంలో చురుకుగా హుషారుగా యువకులు ఉన్నవారికి భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాల గురించి వివరించి హిందూ ధర్మం గురించి తెలియపరచండి ప్రజలను ఓటు అడిగి భారతీయ జనతా పార్టీ మునిసిపల్ ఎన్నికల్లో బలపరిచిన అభ్యర్థులను గెలిపించి కొల్లాపూర్ గడ్డ అంటే బిజెపి గడ్డ అనే విధముగా కొల్లాపూర్ కోటపై కమలం పువ్వు జండా ఎగరవేసి కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్ కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు వివరించారు. గతంలో మునిసిపల్ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గం ఇన్చార్జిగా నేను పని చేసినప్పుడు కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ పదవి కైవసం చేసి ఆ పార్టీకి గిట్టుగా అందించానని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు వివరించారు, మళ్లీ ఇప్పుడు కొల్లాపూర్ లో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు ఇన్చార్జిగా వహిస్తూ భారతీయ జనతా పార్టీ కార్యకర్తను కడప గడపన తిరిగి ఉద్రేక్తపరిచి రెండు పార్టీల గురించి ప్రజలకు వివరించి కాళ్లు వేళ్ళు మొక్కి భారతీయ జనతా పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించి కొల్లాపూర్ కోటపై కమలం పువ్వు జెండా ఎగరవేస్తానని కొల్లాపూర్ ఎన్టీఆర్ చివరస్త నడిబొడ్డున రెండు పార్టీలకు సవాలు విసిరారు గువ్వల బాలరాజ్. . ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సర్కార్ రావాలని కళ్ళల్లో వత్తులు వేసుకొని రాత్రి పగలు తేడా తెలియక పార్టీని బలోపేతం చేసుకుంటూ ప్రజల కష్టాలు తీర్చుకుంటూ ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నది కేంద్ర ప్రభుత్వాన్ని వివరించారు. ఇక్కడ రాష్ట్రంలో దొంగ మాటలు చెప్పుకుంటూ ఇచ్చిన 6 గ్యారంటీలు ఒకటి అమలు చేయక ప్రజలను నానా ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ పార్టీకి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠము కొల్లాపురం ప్రజలు చెబుతారని కార్యకర్తలతో మాట్లాడారు. 420 హామీలతో 60 అబద్ధాలతో మోసం చేసి గద్దెని ఎక్కిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొల్లాపూర్ ప్రాంతం నుంచి నేను ఒకటే చెబుతున్నాను మునిసిపల్ ఎన్నికల్లో కొల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ కైవసం కమలం పువ్వు పార్టీ చేసుకుంటుందని ఈ వేదికపై నుండి సవాలు విసిరారు. టిఆర్ఎస్ పార్టీలో నేను ఉన్నప్పుడు ఈ ప్రాంతం నుండి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేగా నిలబడినప్పుడు నేను ఇక్కడికి వచ్చి ప్రచారం చేసి కొల్లాపూర్ ప్రజలు జూపల్లి కృష్ణారావును ఆశీర్వదించారని స్వామి వివేకానంద జయంతి వేడుకలు సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా మళ్ళీ నేను కొల్లాపూర్ గడ్డపై అడుగు పెట్టి మునిసిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపియడానికి గడప గడప తిరిగి కంకణం కట్టుకొని కొల్లాపూర్ కోటపై కమలం పువ్వు జండా ఎగరవేస్తానని మాట్లాడారు. జూపల్లి కృష్ణారావుకు దేవాదాయ శాఖ మంత్రి పదవి ఇస్తే అప్పుడు మంత్రి పదవి శాఖ వద్దు అని నాతో చెప్పిన మాటలు కూడా మీకు గుర్తు చేశారు.కొల్లాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో గువ్వల బాలరాజు ప్రచారం చేస్తున్నారా అన్న విషయం ఇప్పటికే బడే లీడర్ గుండెల్లోనే గుబులు పుట్టుకున్నది నేను కొల్లాపూర్ కు వస్తున్నా విషయం తెలియగానే గుంత నక్కల ఆ పార్టీ నాయకులు ఈ పార్టీ నాయకులు రెండు పార్టీల వాళ్లు గువ్వల బాలరాజు ఏ విధంగా స్కెచ్ లు వేసి ప్లానింగ్ చేసి మున్సిపల్ చైర్మన్ పదవినీ కైవసం చేసుకుంటారని ఇక్కడ ఉన్న మంత్రి జూపల్లి కృష్ణారావుకు గుండెలలో గుబులు ఇప్పుడు మొదలయ్యింది అని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ యువ నాయకులు ఒక్కొక్కరు 100 మందితో సమానంగా సైనికుల్లాగా పనిచేసి మునిసిపల్ ఎన్నికల్లో కమలం పువ్వు జెండా ఎగిరే విధంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని వేదికపై నుండి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ప్రజా ప్రతినిధులు మండల నాయకులు జిల్లా నాయకులు టౌను అధ్యక్షులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి**

**మహబూబ్‌నగర్, జనవరి 12 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. సోమవారం సాయంత్రం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల నిర్మాణంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సిఎస్ రామకృష్ణారావు హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీలో ముందు వరుసలో ఉంచేందుకు ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతుందని అన్నారు. జిల్లాల వారీగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి సంబంధించి స్థల సేకరణ, నిర్మాణ పనులు, తదితర అంశాలపై జిల్లాల వారీగా కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ఈ నిర్మాణాలపై సమీక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో నిర్మాణ ప్రదేశాలకు వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వి.సి.కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ,జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలం పెద్దాయి పల్లి లో, దేవరకద్ర నియోజకవర్గం సి.సి.కుంట మండలం ధమగ్న పూర్ లో పనులు ప్రారంభమై ప్రగతి లో నున్నట్లు,మహబూబ్ నగర్ లో భూమి గుర్తించి శంకుస్థాపన కు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు సి ఎస్. రామకృష్ణారావు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు తగు ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులలో పాల్గొనబోయే అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. తగినంత మంది సిబ్బంది అందుబాటులో ఉన్నారో లేదా పరిశీలన చేసుకోవాలని సూచించారు. సిబ్బంది, సామగ్రి సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. ఎఫ్ఎస్టి, ఎస్ ఎస్ టి బృందాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడగానే ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలయ్యేందుకు పర్యవేక్షణ కు నోడల్ అధికారులను నియమించాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై జిల్లాల వారీగా కలెక్టర్లను పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫోటో ఎలక్టరోల్స్ జాబితా, డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలు, తదితర అంశాల వివరాలను సిఎస్ కు జిల్లాల వారీగా కలెక్టర్లు వివరించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ,జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్,సి. ఎం.ఓ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు




# వీపనగండ్ల - బెక్కెం రహదారికి బంగారు భవిష్యత్తు

**మూడు కోట్ల 90 లక్షల బీటీ రోడ్డు పనులను ఘనంగా ప్రారంభించిన సర్పంచ్ మీసాల పార్వతమ్మ మండల అధ్యక్షులు గోదల బీరయ్య యాదవ్.**

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

మండల కేంద్రంలో వీపనగండ్ల నుంచి బెక్కెం వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధికి కీలక అడుగులు పడింది గ్రామ సర్పంచ్ మీసాల పర్వతమ్మ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోదాల బీరయ్య యాదవ్ గురువారం రోజు మూడు కోట్ల 90 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులను అధికారికంగా ప్రారంభించారు ఈ రహదారి ప్రాంత ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న బేక్కేమ్ రోడ్డు పనులను ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవతో నిధులు మంజూరై పనులు ప్రారంభించామని వారు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రహదారి పూర్తయితే వీపనగండ్ల బెక్కెం గ్రామాల మధ్య రాకపోకలు సులభం అవుతాయని రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు త్వరగా తరలించగలరని వారు అన్నారు ప్రజా సంక్షేమం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు ఈ రహదారి నిర్మాణం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చలనం పెరుగుతుందని చిన్న వ్యాపారులు బలోపితం అవుతాయని రవాణా ఖర్చులు తగ్గుతాయని అన్నారు నాణ్యమైన పనులు చేసి రహదారి దీర్ఘకాలం ఉపయోగపడేలా నిర్మించాలని కాంట్రాక్టర్లకు సూచించారు ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నారాయణరెడ్డి బొల్లారం సర్పంచ్ సుదర్శన్ రెడ్డి ఉపసర్పంచ్ బాలపి రు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి గోపి వెంకట్ రెడ్డి నక్క విష్ణు కావలి మహేష్ వి వెంకట్రెడ్డి పి వెంకట్ రెడ్డి చాకలి వీరబాబు బసవరాజ్ గౌడ్ సమీర్ ఎస్ వెంకటయ్య వార్డు సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

